www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025
5
కాకినాడ



15న రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎస్సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. కావున ఎస్సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలని అన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పథకం మంజూరుకు కావలసిన సర్టిఫికెట్లతోపాటు, ఫోన్ నెంబర్‌తో రావాలన్నారు.

భద్రత లేని బతుకులు

- విస్తరిస్తున్న గిగ్ వ్యవస్థ
- గుర్తింపునకు నోచుకోని వర్కర్లు
- వర్తించని పిఎఫ్.ఇఎస్ఐ, గ్రాడ్యూటీ, బోనస్
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డిజిటల్ వేదికల ద్వారా వినియోగదారులకు ఆహార పదార్థాలు,మందులు, వస్తువులు తెచ్చి ఇచ్చేవారు, రవాణా సేవలు అందించేవారిని గిగ్ వర్కర్లు అంటారు. జొమోటో, స్విగ్గీ, ఉబర్, ఓలా, డూన్జీ, జెప్టో, ర్యాపిడో తదితర సంస్థల్లో పని చేస్తున్నారు. వీరికి ఆయా సంస్థలు కనీస వేతనాలు ఇవ్వరు. కార్మిక చట్టాల ప్రకారం అందించే సౌకర్యాలు అందవు. ఎటువంటి భద్రత లేకుండానే వర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా సమస్యల పట్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల నుంచి 3,500 వరకూ వివిధ సంస్థల్లో గిగ్ వర్కర్లు పని చేస్తున్నారు. ప్రస్తుతం నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం వలన ఉపాధి మార్గాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో అనేకమంది స్వయం ఉపాధి మార్గాలను ఎన్నుకుంటున్నారు. గిగ్ వర్కర్లుగా సైతం పని చేస్తున్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వాళ్ళు సైతం ఈ రంగంలో ఉపాధి కోసం చేరుతున్నారు. ఈ నేపథ్యంలో వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కార్పొరేట్ సంస్థలు గిగ్ వర్కర్ల శ్రమను దోచుకుంటున్నాయి.

కార్మికులుగా లేని గుర్తింపు

గిగ్ వర్కర్లను ఆయా కంపెనీలు అసోసియేట్ పార్టర్స్‌గా చేర్చుకుంటున్నాయి. అయితే కార్మికులుగా మాత్రం గుర్తించరు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కార్మికులుగా గనక గుర్తిస్తే ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించాల్సి వస్తుంది. అలాగే పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలి. పనికి తగిన బోనస్ ఇవ్వాలి. గ్రాడ్యుటి చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి. అయితే కార్మిక చట్టాల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుంటున్న ఆయా కంపెనీలు వీరిని అసోసియేట్ పార్టర్స్‌గా పనిలో పెట్టుకున్నాయి. కంపెనీలో కార్మికులు చేస్తున్న ప్రతి పనినీ వీళ్ళతో చేయిస్తున్నారు. కొరియర్, పోస్టల్ డిపార్ట్మెంట్లలో సర్వీసు చేస్తున్న వారందరికీ కార్మిక చట్టాలు వర్తిస్తాయి. కానీ అంతకంటే ఎక్కువగా పని చేస్తున్న గిగ్ వర్కర్లకు మాత్రం చట్టాలు వర్తించకుండా యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి.

శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ

వీరికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అమలు కావటం లేదు. దానితో ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని గందరగోళంలో బతుకుతున్నారు. రోజుకు ఎంత ఆదాయం వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఎక్కడ ఏ రకమైన దాడి జరుగుతుందో భయభ్రాంతులతో పనిచేస్తున్నారు. కమీషన్ బేస్ ప్రకారం పని చేస్తున్నారు. వినియోగదారుడు బుకింగ్ చేసిన విలువలో కేవలం 5 నుంచి 30 శాతం మాత్రమే కమీషన్‌గా జమ చేస్తున్నారు. రవాణా రంగంలో సొంత వాహనం, సొంత ఇంధనం కలిగి ఉంటుంటే కేవలం 30 శాతం మాత్రమే సంస్థలు గిగ్ వర్కర్లకు కమీషన్‌గా అందజేస్తున్నాయి.

కమీషన్‌ను తగ్గిస్తున్న యాజమాన్యాలు

గిగ్ వ్యవస్థకు ఇటీవల ప్రాధాన్యత బాగా పెరుగుతుంది. దీంతో కమీషన్ కూడా సంస్థలు తగ్గిస్తున్నాయి. అలాగే ఆహార పదార్థాలను బుకింగ్ చేసుకుంటుంటే భారీగా ధరల వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రజలను దోచుకుంటుండగా వర్కర్లకు మాత్రం కమీషన్లను గణనీయంగా తగ్గిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యాలకు సంబంధం లేకుండా చట్టాలను వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్కర్లు ప్రమాదంలో గనుక చనిపోతే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వారిని ఆదుకునే వారు ఎవరు కనిపించడం లేదు. ప్రభుత్వం కూడా వీరికి అనుకూలంగా ఎటువంటి చట్టాలు తీసుకురావడం లేదు. మరోవైపు ఆయా యాజమాన్యాలు వర్కర్లపై పోటీ తత్వాన్ని పెంచుతున్నాయి. సమయానికి వెళ్ళకపోతే కమీషన్‌లో కోత పెడుతున్నాయి. దీంతో సమయం ఒత్తిడి వర్కర్లపై విపరీతంగా పడుతుంది. కొంతమంది ఆకతాయిలు వర్కర్లపై భౌతికంగా దాడులకు దిగుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో ఒక అపార్ట్మెంట్లో ఒక వర్కర్‌పై కొందరు అనుచితంగా ప్రవర్తించారు. బట్టలు విప్పి దాడి చేశారు. దీంతో సంబంధిత అపార్ట్మెంట్లో ఆర్డర్లు ఇచ్చేది లేదంటూ గిగ్ వర్కర్లు బాయ్ కట్ చేసిన పరిస్థితి ఉంది. ఇటువంటి ఘటనలు అనేకచోట్ల జరుగుతున్నాయి. కానీ వెలుగులోకి రావడం లేదు. కానీ యాజమాన్యాలు మాత్రం వర్కర్లకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ విధంగా మానసిక ఒత్తిళ్ల వీరుపై పెరుగుతున్నాయి. పెట్రోల్ ధరలు పెరిగే కొద్దీ నిజ ఆదాయం తగ్గిపోతూ వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వర్కర్ల సమస్యలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికులుగా గుర్తించాలి



గిగ్ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మికులుగా గుర్తించాలి. కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంతోపాటు బోనస్ అందించాలి. కనీస వేతనాలను అమలు చేయాలి. భౌతిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో చట్టపరమైన రక్షణ కల్పించాలి.

-సిహెచ్.రాజ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

గైడ్స్ కంటే టెక్ట్స్ బుక్స్ మేలు

ప్రజాశక్తి - కాకినాడ

పోటీ పరీక్షల్లో గైడ్స్ కంటే టెక్ట్స్ బుక్స్‌ను అభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సూర్య కళామందిరంలో డిఎస్‌సిపై అవగాహన సదస్సు యుటిఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు వివి.రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా యుటిఎఫ్ అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగానే ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 44 గరిష్ట వయోపరిమితిని 47 సంవత్సరాలుగా మార్చాలని కోరారు. గత ఏడు సంవత్సరాలుగా డిఎస్‌సిని నిర్వహించని కారణంగా ప్రభుత్వం ముందు ఈ డిమాండ్‌ను పెడుతున్నట్లు తెలిపారు. 47 సంవత్సరాలకు పెంచడం ద్వారా అనేక మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఇక డిఎస్‌సి పరీక్ష ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ లో జరపాలని కోరారు. అకడమిక్ అంశాలపై అవగాహన కల్పించారు. పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ సబ్జెక్టులపై మెళుకువలను వివరించారు. ప్రతీ మార్కు ఉద్యోగ పరీక్ష ఉత్తీర్ణతలో అర్హత సాధించ డంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. కావున అభ్యర్థులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ స్పాట్ విశ్లేషణ చేసు కోవాలని, సబ్జెక్ట్‌లో ఉన్న బలహీనత గుర్తించుకుని దానిని నుంచి బయటపడే మార్గం అన్వేషించు కోవాల న్నారు. ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడికి గురికాకుండా గత డిఎస్‌సి పేపర్లు స్టడీ చేసి, ప్రశ్న స్వభావం గుర్తించి ప్రిపరేషన్ అవ్వాలన్నారు. జనరల్ నాలెడ్జ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాన్సెప్ట్‌ను సృజనాత్మకతతో చదవాలన్నారు. పోటీ పరీక్షలకు- అకడమిక్ పరీక్షలు మధ్య ఉన్న తేడా వివరించారు. మెథడాలజికి సంబంధించి తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాలు చదవడం ఉత్తమం అని అన్నారు. గైడ్స్ కంటే టెక్ట్స్ బుక్స్ చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇక సబ్జెక్టులకు సంబంధించి కరెంట్ అఫైర్స్, విద్యారంగం, విద్యా మనోవిజ్ఞాన శాస్త్రంపై మెళుకువలను వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల సమకాలీన అంశాలపై కెఎస్.లక్ష్మణరావు రాసిన సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి రెండు వందల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చక్రవర్తి, ఐ.ప్రసాదరావు, నాగేశ్వరరావు, సాయిరాం, ప్రభాకరవర్మ, గోవిందరాజులు, సీతారామయ్య, రామలక్ష్మి, దేవి, సీతారామరాజు, సిఐటియు నాయకులు పలివెల వీరబాబు, ఎస్ఎస్ఐ నాయకులు పాల్గొన్నారు.



మెటీరియల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

యువతికి ఉపాధి కల్పనతో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎడిబి రోడ్డులో రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించే ఎంఎస్ఎంఇ పార్కుకు వారు శంకుస్థాపన చేశారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికి వేత్త నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. విజన్ 2047 లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. యువతరం భాగస్వాములు కావటం ద్వారా భవిష్యత్తు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉపాధి కల్పనే ధ్యేయంగా అన్ని రకాల ప్రోత్సాహకాలతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.రమణారెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, డిఎల్‌డిఒ కెవి.పసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రౌతులపూడి

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం పిలుపునిచ్చారు. మంగళవారం రౌతులపూడిలో ఉపాధి హామీ కూలీల పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 1.10 కోట్ల మంది పైగా ఉపాధి హామీ కూలీలుగా ఉంటే అందులో 54.85 లక్షలు మంది కూలీలుగా పని చేస్తున్నారని, వారికి ఈ ఏడాది 12 కోట్ల పని దినాలు కల్పించాల్సివుందన్నారు. అయితే కేవలం 6.5 కోట్ల పని దినాలు మాత్రమే అనుమతించారని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.2.5 లక్షల కోట్లు కేటాయించి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం

సత్యదేవుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - శంఖవరం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి మాండవ అన్నవరం సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రత్నగిరి కొండపైకి విచ్చేసిన న్యాయమూర్తికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో అధికారులు దేవస్థానం లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి కిరణ్మయి మాండవ స్వామి వారి వ్రతం ఆచరించుకుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి దేవస్థానం పండితులు వేద ఆశీస్సులు నిర్వహించగా ఇఒ వీర్ల సుబ్బారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కె.కొండలరావు, పిఆర్‌ఒ కృష్ణారావు, విశ్రాంత ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న ఇఒ

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

అనారోగ్యం భారిన పడి వైద్యం చేయించుకున్న బాధితునికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరు అయిన చెక్కును టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ బాధితునికి అందజేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముదిలి రామచంద్రరావుకు రూ.45,798 చెక్కును నవీన్ అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, కొత్తపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు దిండి రాజు, అడబాల సింగరయ్య, ముదిలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న నవీన్

వృథా గడ్డిని దహనం చేయొద్దు

ప్రజాశక్తి - కాజులూరు

వరి చేలలో ఉండే వృథా గడ్డిని అంటించరాదని వ్యవసాయ శాఖ ఎఒ వి.అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ, కాజులూరు, తిప్పరాజు పాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతల అనంతరం చేలల్లో ఉండే వరిగడ్డిని దహనం చేస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. గతంలో అనేక ప్రమాదాలు సంభవించి రైతులు నష్టపోయిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వరి రైతులు నిర్లక్ష్యం ఊహించకుండా కాలువ నీరు వచ్చిన అనంతరం చేలల్లోకి నీరు పెట్టినట్లయితే సూపర్ ఎరువును వినియోగించినట్లయితే గడ్డి కుళ్ళిపోయి భూసారాం పెరుగుతుందన్నారు. దీంతో భూమికి లబ్ది చేకూరుతుందన్నారు. కొన్ని గ్రామాల్లో వృథా గడ్డిని యంత్రాల సాయంతో భద్రపరుచుకుని విక్రయిస్తుండడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కౌలు రైతుకు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకూ అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

7వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు బొమ్మన రవికుమార్, గుడిసి నాగేశ్వరరావు, తూతిక సాయి, డి రాజు, మలిపెద్ది వీరభద్రరావు, పచ్చిపాల శ్రీను, బొప్పే వీరభద్రరావు పాల్గొన్నారు.



శిబిరంలో ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

29వ రోజుకు మజ్జిగ పంపిణీ


ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం మంగళవారానికి 29వ రోజుకి చేరింది. నాగులపల్లిలో పుచ్చలపల్లి సుందరయ్య స్మారకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి సందర్శించారు. మండుతున్న ఎండలతో బాటసారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అటువంటి వారికి చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. దాతలు ముందుకొచ్చి మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.నాగేశ్వరరావు, సిహెచ్.చిన్ని, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

కార్టూ'నిజం'



సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారు: వైఎస్ జగన్

జీవవైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పాల్గొని మాట్లాడారు. జీవవైవిధ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలనీ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఇన్‌ఛార్జ్ కె. కిషోర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొని జీవవైవిధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్య కార్యదర్శి పి.రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరావు, ప్రముఖ ఇంద్రజాలకుడు విఎస్‌వి.రమణమూర్తి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు టి.నళిని ప్రియా, టిజె.కృష్ణ, బి.శ్రీదేవి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శాఖ గ్రంథాలయంలో హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొని తెలుగు చందస్సుపై వివరించారు. గ్రంథాలయాధికారి పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య, కొమ్మన అప్పారావు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ పూర్ణిమ

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రాజ్యాంగం కల్పించిన హక్కులపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సిడిపిఒ ఎం.పూర్ణిమ సూచించారు. మంగళవారం మండలంలోని రాజపూడి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె బాలలకు ఉన్న హక్కులను వివరించారు. గోరింటాకుతో చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100 వారి చేతులపై వినూత్నంగా వేయించారు. బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.లోవ, సూపర్‌వైజర్ ఎస్.అమ్మాజీ, ఎఎన్ఎం, ఆశ, విఎఒలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రక్షిత మంచినీటి పథకం ద్వారా అందిస్తున్న తాగునీటి సరఫరాలో బుధవారం అంతరాయం కలుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమణ మంగళవారం తెలిపారు. వాక తిప్పలో ప్రధాన పైపులైనుకు చేపడుతున్న మరమ్మతుల కారణంగా కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, అమీనాబాద్‌తోపాటు పలు గ్రామాలకు తాగునీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఈనెల 15వ తేదీన ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ శివరామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు వివిధ శాఖలపై సమీక్ష చేపట్టడం జరుగుతుందని, మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్ పద్మావతి బదిలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి బదిలీ అయ్యారు. ఆమెను రాష్ట్ర మున్సిపల్ పరిపాలన విభాగం కార్యాలయంలో రిపోర్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ నగరపాలక సంస్థ సెక్రటరీ కె.శ్రీకాంత్‌రెడ్డిని మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఏలేరు కాలువలో మంగళవారం ఈతకు దిగారు. వీరిలో ఇద్దరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఒడ్డును ఉన్న ఇతర విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న రైతులు సత్యనారాయణ, సిద్దు నీటిలో కొట్టుకుపోతున్న కాకినాడ సిరి అనే కుర్రాడిని రక్షించారు. గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ కాలువలో గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, పోలీస్ అధికారులు స్థానికులు గాలింపు చేపట్టారు. ఈ ప్రమాదంలో బయటపడ్డా యువకుడికి ఏలేశ్వరంలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏలేరు కాలువ నీటి ఉధృతిని తగ్గించి గల్లంతైన యువకుడి ఆచూకి తెలుసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.92,050లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు. అలాగే జి.రాగంపేట గ్రామంలో నిర్వహించిన పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.72,560 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు చోట్ల జరిగిన దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గొల్లప్రోలులో...

మండలంలోని కొడవలి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.4450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లిలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లిలో గడ్డిమేటు దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపల్లి నుంచి సుబ్బంపేట వెళ్లే దారిలో వాకతిప్ప గ్రామానికి చెందిన లొల్ల వీర వెంకట సత్యనారాయణ పొలాన్ని జాను అనే వ్యక్తి కౌలుకి తీసుకోగా 8 ఎకరాల్లో కోతల కోసి వచ్చిన గడ్డిని భద్రపరచుకున్నాడు. ఐదు లక్షల విలువచేసే గడ్డి మేటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గడ్డిమేటు దగ్ధం కావడంతో కౌలు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి ఒక కోడి పుంజు, రూ.8020 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రెండు గ్రావెల్ లారీలు సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ, కోటి కేశవరం గ్రామాల పరిధిలోని గ్రావెల్ కొండల నుండి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి రెడ్డి సుబ్రమణ్యం అనే వ్యక్తి లారీల ద్వారా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సీతానగరం ఎస్ఐ డి.రామకుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు లారీలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సీతానగరం ఎస్ఐ రామకుమార్ మాట్లాడుతూ పట్టుబడిన గ్రావెల్ లారీల వివరాలను మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేశామని చెప్పారు. మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఆ లారీలకు తగిన జరిమానా విధిస్తామన్నారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ మరియు ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక ఇసుక తిన్నెల్లో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అమలాపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు, సిఐ కె.కాత్యాయిని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇసుక తిన్నెల్లో నాటు సారా తయారు చేయడానికి నిల్వ ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారులకు నష్టం జరగకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక మెయిన్ రోడ్‌లోని తాళ్లూరి వారి సత్రంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూనికలు కొలతలు వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ప్రతి సంవత్సరం లైసెన్సులు రెన్యువల్స్ చేయించుకోవా లన్నారు. తూనికలు, కొలతలు, ఇతర లైసెన్సులు వినియోగ దారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. కల్తీలు, మోసాలకు దూరంగా ఉండాలన్నారు. తరచుగా షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తామని, మోసం కనబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల సంఘ సభ్యులు వి.శ్యామల, జిబిఆర్.చౌదరి, సత్యనారాయణ, ఎం.భాస్కరరావు, మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, ఇతర నాయకులు

కార్మికుల హక్కులను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉషోదయ పార్క్ వద్ద సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్ల కాలం నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని, మే 20వ కార్మిక లోకమంతా ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.178 ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. పార్లమెంటు సభ్యులకు రూ.4 లక్షలు నెల జీతంగా ఉంటే కార్మికులకి చాలీచాలని జీతాలు ఏంటని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ స్టీల్ ప్లాంట్, పోస్టల్, రైల్వే ఎల్ఐసి వంటి సంస్థలు ప్రయివేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మె సాగుతుందని అన్నారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్కీమ్ వర్కర్స్ నాయకులు అల్లాడి లక్ష్మీ, హేమలత, సత్య, నాగలక్ష్మి, అనంతలక్ష్మీ, సత్యవతి, సుబ్బలక్ష్మి, రాజు, కె.సతీష్‌కుమార్, ఎం.మణికంఠ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం'


ప్రజాశక్తి - సామర్లకోట


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మండల రెవెన్యూ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. ఆర్థిక భారం ఉన్న సూపర్ సిక్స్‌లోని పథకాలను వరుసగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అంతా దోచుకోవడం, దాచుకోవడమే జరిగిందని విమర్శించారు. ప్రజల భూములను హరించేందుకు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసిందని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన రీ సర్వేను గత వైసిపి నాయకులు స్వప్రయోజనాల కోసం తప్పుల తడకగా మార్చారని ఎద్దేవా చేశారు. వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి సర్వే రాళ్లపై, పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మ వేశు కున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల అకాంక్షలకు అనుగుణంగా పని చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యతనిస్తూ పరిపాలన అందిస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, సామర్లకోట ప్రాంతంలోని లో ఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డిఎల్‌డిఒ కెఎన్‌వి.ప్రసాద్‌రావు, తహశీల్దార్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజా, తదితరులు పాల్గొన్నారు.

16న కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి - కాకినాడ



అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్‌ఒ వెంకట్రావు

భవనాలు కూలడం, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్ ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ జె.వెంకట్రావు తెలిపారు. మంగళవారం జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్స్ కమిటీ సమావేశం డిఆర్‌ఒ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ సూచనల కనుగుణంగా శత్రుదాడుల వల్ల గాని, ఆకస్మికంగా గాని భవనాలు కుప్పకూలడం, అగ్ని ప్రమాదాలు జరిగితే సివిల్ డిఫెన్స్ ప్రిపేర్డ్‌నెస్ వ్యవస్థ ద్వారా పౌర రక్షణకు తక్షణం స్పందించేందుకు వివిధ శాఖల సమన్వయంతో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, రవాణా, పౌరసరఫరాలు, విద్యుత్, పశుసంవర్ధన, పంచాయితీ, విద్యా శాఖల సమన్వయంతో ఇడిఇఒసి పని చేస్తుందన్నారు. విపత్తు సమయాల్లో చేపట్టవలసిన ప్రామాణిక రక్షణ, సహాయక చర్యలను ఆయా శాఖలకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ఈ మేరకు భవనాలు కూలడం, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ స్పందించడంలో డిఇఒసి సమర్థత, సంసిద్ధతలను పరిశీలించేందుకు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో మాక్ డ్రిక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, డిఇఒసి నోడల్ అధికారి, లాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డిసి డి.భారతి, జిల్లా అగ్నిమాపక అధికారి పివిఎస్.రాజేష్, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఎస్ఐ యు.ఆంజనేయస్వామి, డిటిసి కె.శ్రీధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి - గండేపల్లి


ప్రయివేటు వసతి గృహాలను పరిశీలిస్తున్న పోలీసులు

విద్యార్థినీ, విద్యార్థులు ఎటువంటి వ్యసనాలకు బానిసలు కావద్దని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు విద్యాసంస్థలు, వసతి గృహాలను సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి మత్తు పదార్థాలు, పానీయాలు లేకుండా చూడాలని, అలాగే భద్రతా ఏర్పాట్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత వసతిగృహాలు, విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యాలను ఆదేశించారు. వసతి గృహాలతోపాటు, పరిసర ప్రాంతాల్లో హై రీవెల్యూషన్ కలిగిన సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రయివేటు వసతి గృహాల చుట్టూ రక్షణ గోడలు సాధ్యమైనంత ఎత్తుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు బయటికి వెళ్లి, వచ్చేటప్పుడు ఇన్ అండ్ ఔట్ రిజిస్టర్‌ను సక్రమంగా మెయింటైన్ చేయాలని అన్నారు. ఎటువంటి ఈవ్ టీజింగ్, అనుమానిత వ్యక్తుల కదలికలను గుర్తిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట, పెద్దాపురం ఎస్ఐలు యువి.శివనాగబాబు, జి.సతీష్, రఘునందన్‌రావు, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో మంగళవారం బాలలకు ఆకులతో బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. పిసిసి గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో కరాటేలో తెప్పల యోగేష్, వ్యాయామంలో లోకేష్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ లెక్కలు, మ్యాజిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకుంటున్నవి నిత్య జీవితంలో ఉపయోగపడతాయని అన్నారు. కర్ర సాములో నీలపాల కృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, మణికంఠ, సాయి, బంగారం, నేహా, రేణుక, హర్ష, సందీప్, భాషా, లావణ్య ,అంజలి, సత్య పాల్గొన్నారు.

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శంఖవరం


పవలింపు సేవలో సత్యదేవుడు

సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల పుష్పయోగ ఘట్టంతో ఘనంగా ముగిశాయి. రాత్రి 8 గంటలకు రత్నగిరిపై గల నిత్యకళ్యాణ మండపం ఆవరణలో కోలాట నృత్యాలతో పుష్పయోగ కార్యక్రమానికి పళ్లు, తీపిపదార్ధాలు, పువ్వులను తీసుకొచ్చారు. వధూవరులైన స్వామి, అమ్మవార్లకు పుష్పయోగానికి సంకల్పం చేశారు. ఆలయ ఛైర్మన్ రాజా ఐవి. రోహిత్, ఇఒ వీర్ల సుబ్బారావు పట్టువస్త్రాలు సమర్పించిన తరువాత స్వామి, అమ్మవార్లకు అర్చక స్వాములు బ్రహ్మముడులు వేసి సుమూహూర్తధారణ చేసి ఊంజల్ సేవ నిర్వహించారు. శేషపాన్పుపై పవళిస్తున్న స్వామివారిని అమ్మవారు సేవిస్తున్నట్లుగా అలంకరించగా వారికి అనేక రకాల పండ్లు, తీపి పదార్ధాలు నివేదనగా పెట్టారు. తదుపరి పెద్దఎత్తున హాజరైన భక్తులు ఎదురుగా ఉంచిన అద్దంలో స్వామి, అమ్మవార్లను తనివితీరా దర్శించుకుని తరించారు. ఏకాంతసేవ ఆశీర్వచన కార్యక్రమం పూర్తిచేసి భక్తులకు ప్రసాద వితరణ తోపాటు మహిళలకు రవికలను పంపిణీ చేశారు.

అధ్యక్షునిగా ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

జగ్గంపేట యూనిట్ ఉద్యోగ సంఘాల అధ్యక్షునిగా గండేపల్లి పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్ ఎన్నిక అయ్యారు. మంగళవారం జగ్గంపేటలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జగ్గంపేట యూనిట్ కార్యవర్గం ఎన్నిక మహిళా సమాఖ్య భవన్లో జరిగింది. ఈ ఈ సందర్భంగా గండేపల్లి పంచాయతీ సెక్రటరి కె.ఫణీంద్రకుమార్ అధ్యక్షునిగా, తాళ్లూరు-2 వెల్ఫేర్ అసిస్టెంట్ కోడూరి ప్రసాద్ జనరల్ సెక్రటరీగా, జగ్గంపేట విఆర్‌ఒ వల్లభశెట్టి సురేష్‌కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులుగా శర్మ, టి.మంగదేవి, పి.సునీత, విసి.సతీష్‌కుమార్, సద్గురు మూర్తి, జోకా అమృత, పిడిమి రమేష్, పి.సతీష్, సిహెచ్.దివ్య, నారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.జగన్నాథం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రత్నరాజ్, జిల్లా జాయింట్ సెక్రటరీ భానుప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు వచ్చిన ఎదుర్కోవాలని, ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

రోడ్డు ప్రమాదంలో మరణించిన కట్టమూరుకు చెందిన టిడిపి కార్యకర్త కేసారపు వీర్రాజు కుటుంబ సభ్యులకు మంగళవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప రూ 5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎలిశెట్టి నాని, గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం చెందిన మురళీనాయక్‌కు మండలంలోని ఇంజరంగ్రామ ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానికంగా మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన నాయక్ త్యాగం మరువలేనిదని కొనియాడారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సత్తి సోమరాజు, కురుమళ్ళ నాగేశ్వరావు, సతీష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న అడిషనల్ ఎస్‌పి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారిని 3వ బెటాలియన్ అడిషనల్ ఎస్‌పి దేవానందరావు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం అధికారులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు.

త్వరలోనే పార్టీ కమిటీలను పూర్తి చేస్తాం

ప్రజాశక్తి - కిర్లంపూడి

త్వరలోనే గ్రామ స్థాయి నుంచి కమిటీలను పూర్తి చేస్తామని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మంగళవారం ముద్రగడ నివాసంలో రౌతులపూడి వైస్ ఎంపిపి సూరెడ్డి సాయిదొరతోపాటు, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

పాదగయను దర్శించుకున్న దర్శకుడు హను

ప్రజాశక్తి - పిఠాపురం

పాదగయను సీతారామంను సినీ దర్శకుడు హను రాఘవపూడి మంగవారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవార్ల దర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన సహాయ కమిషనర్ కాట్నం జగన్మోహన్‌శ్రీనివాస్ ఆయనకు శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లంరాజు చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆర్ఎఒ మునిస్వామిని సత్కరించిన ప్రిన్సిపల్ రత్నప్రభ, భాను, ప్రకాష్

ప్రభుత్వ కళాశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎబిఇ, హెచ్ఇపి విభాగాల్లో సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షకు హాజరైన 42 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వైస్ ప్రిన్సిపల్ జి.రత్నప్రభ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎఒ మునిస్వామిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమలో గీదా భానుప్రసాద్, పాలికి శివప్రకాష్ పాల్గొన్నారు.

సిబిఎస్ఇలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - యానాం

సిబిఎస్ఇ ఫలితాల్లో యానాం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్స్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది నుంచి స్టేట్ సిలబస్ స్థానంలో సిబిఎస్ఇ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో మంగళవారం వచ్చిన ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత నమోదయ్యిందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ ప్రకటనలో తెలిపారు. ఎంజిజి ప్రభుత్వ హైస్కూల్లో పరీక్షకు హాజరైన 12 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషుమీడియం హైస్కూల్లో 64 మందికి 63 మంది, కెఎన్‌జిజి బాలికల హైస్కూల్లో హాజరైన 22 మంది, డాక్టర్ కెఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్ దరియాలతిప్పలో 23 మంది, మెట్టకూరు పిజెఎన్ ప్రభుత్వ హైస్కూల్ లో హాజరైన 24 మంది, కనకాలపేట ఎస్‌కెఎస్‌పివిఆర్‌ఎన్ ప్రభుత్వ హైస్కూల్లో 29 మందికి 28 మంది, పరంపేట అంబేద్కర్ ప్రభుత్వ హైస్కూల్లో హాజరైన 18 మంది, గిరియాంపేట పికె ప్రభుత్వ హైస్కూల్లో హాజరైన 91 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 8 హైస్కూల్స్‌లో 283 మంది పరీక్షకు హాజరు కాక 281 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎఒ మునిస్వామి విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్‌ను సత్కరించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహకంగా బుధవారం మధ్యాహ్నం సుందరయ్య భవన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు మంగలవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఏళ్ళతరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసే కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కచేరిపేట సుందరయ్య భవన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 225/2025-జి-1 — తేది.13-05-2025

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్లు అనగా 1. పావురాల తూము నుండి ఉప్పరిపేట రోడ్డు, 2. JNTUK స్టేడియం రోడ్డు, 3. గ్రంధి కళ్యాణ మండపం రోడ్డు, సిదార్ధ నగర్, 4. సాంబమూర్తి నగర్ 5వ వీధి, 5. సూర్యరావుపేట, బీచ్ రోడ్డు దగ్గర, త్యాగరాజు నగర్, 6. మెయిన్ రోడ్డు (or) సుభాష్ రోడ్డు, 7. మెహర్ నగర్ రోడ్డు, 8. యేసు వారి వీధి, జగన్నాధపురం నందు భవిష్యతులో అభివృద్ధి చేయవలసిన రోడ్ల నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమై యున్నందున ఆయా వ్యక్తులు ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్లు విస్తరణలో పోవుచున్న స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No. 119 MA&UD, Dept Dt. 28-03-2017, G.O.Ms. No. 180, MA&UD, Dept. 01-10-2020 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms. No. 4, MA&UD, Dept. 09-01-2025 లను అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడినది. మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate ల కొరకు TDR కమిటీ వారి నిర్ణయముకు లోబడి జారీ చేయబడునని తెలియచేయడమైనది.

S. No.	Name of the Applicant	Location of the Site Affected	Survey Number	Extent Affected in Road Widening as per Master Plan/ Area Development Plan in (Sq.m)	Master Plan Road/ Area Deveopment Plan Road / Connecting Road	Application Number/ date	Urban/ Rural	Remarks
1	Sagarapu Nookalamma / 012582	Pavuralathum to Uppari peta Road	237/4 Part	153.28	Master Plan	12582	Urban	
2	Gampu Veera Venkata Ramana / 010440	Stadium Road Gollala Street	88/3-2	48.16	Master Plan	10440	Urban	
3	1. Degala Suresh Kumar, 2. Degala Venkata Ramanamma, 3. Degala Ram Mohan Raja 4. P.N.V.V.S.Jayalakshmi Kumari, 5. Koppireddy Prameela Rani, 6. Vadupu Sridevi / 013131	Grandhi Kalyana Mandapam Road, Siddardha Nagar	121/1	55.49	Master Plan	13131	Urban	
4	Kotipalli Satyadevi / 002046	Sambamurthy Nagar 5th Street	136/4P ART	20.61	Master Plan	2046	Urban	
5	Patneedi Suryanarayana / 011894	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	109.67	Master Plan	11894	Urban	
6	Patneedi Bhavya Prathyusha / 011887	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	868.24	Master Plan	11887	Urban	
7	Patneedi Manoja Sreelakshmi Seetha Anusha / 011889	Suryaraopeta Near Beach Road	255/1C	433.48	Master Plan	11889	Urban	
8	Burra Veera Venkata Satyanarayana/ 011758	Meher nagar Road	209/3P	29.58	Master Plan	11758	Urban	
9	Allam Veera Venkata Malikarjuna Rao / 006379	Yesuvaristreet Jagannadhapuram Main Road	851/1 & 839/4	71.46	Master Plan	6379	Urban	
10	Appana Kamaraju / 013770	Main (Subash) Road	987	87.07	Master Plan	13770	Urban	

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 07 రోజులలోగా ఈ క్రింది సంతకము దారునకు లిఖిత పూర్వకముగా ఆఫీసు పని వేళలలో అందజేయవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు,** కాకినాడ నగరపాలక సంస్థ